క్లుప్తంగా

సమరయోధుడు రామమూర్తికి నివాళి



తిరువూరు: స్వాతంత్య్ర సమరయోధుడు, విశ్వబ్రాహ్మణులను బీసీలలో చేర్చడానికి కృషిచేసిన దివంగత ఎమ్మెల్సీ గానాల రామమూర్తి జయంతి కార్యక్రమం శనివారం తిరువూరులో నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో రామమూర్తి చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు రామడుగు వాసు, చామర్తి రాంబాబు, బ్రహ్మాచారి, కుమారరాజా, ఆర్ఆర్‌కే చారి పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్‌ను విజయవంతం చేయండి



రెడ్డిగూడెం: ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆదివారం జరగనున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండలశాఖ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక అమర్‌భవన్‌లో యూటీఎఫ్ మండల శాఖ సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కౌన్సిల్ సభకు యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి. భవానీ, మహిళా కార్యదర్శి ఎం.రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చాట్రాయి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని పోలవరం కొత్తపేట ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనం పంపిణీ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యరీత్యా మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని ఏమైనా నాణ్యత లోపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.నాగేశ్వరావు పాల్గొన్నారు.

నేటి నుంచి శోభనాచలుని రథసప్తమి ఉత్సవాలు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనగిరిపై ఉన్న శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి మాఘమాస రథసప్తమి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ భవాని తెలిపారు. రోజూ స్వామి కల్యాణ మండపంలో (పెద కొఠాయి)లో వివిధ సామాజికవర్గాల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలు 22 నుంచి ఫిబ్రవరి 1 వరకూ జరుగుతాయి. ముఖ్యంగా 28న ఆలయంలో భక్తులకు విశేష అన్నదానం, 29న ఉదయం రథోత్సవం, తిరుమలలోని మాడ వీధులలో శ్రీవారి రథోత్సవాన్ని తలపిస్తుంది. ఆదివారం నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలకు నూజివీడు ఎమ్మెల్యే, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలైన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్వామి కల్యాణ మహోత్సవానికి వస్త్రాలు సమర్పించనున్నారు.

నేటి నుంచి ఈదర సహాయమాత తిరునాళ్లు

ఆగిరిపల్లి: మండల పరిధిలోని ఈదరలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ ఈదర సహాయమాత తిరునాళ్లు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈదర విచారణ గురువు ఫాదర్ ఆగస్టీన్ శనివారం తెలిపారు. ఉత్సవాలకు ఈదర సహాయమాత కొండను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు జరిగే తిరునాళ్ల ఉత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

దౌర్జన్యకారులపై అట్రాసిటీ కేసు

ముసునూరు: సొంత భూమిలో రాళ్ల పిచ్చి మొక్కలు తొలగించి, అభివృద్ధి చేయించుకుంటున్న దళిత మహిళ కుటుంబాన్ని కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు. మండలంలోని రమణక్కపేటకు చెందిన ఆముదాల బుజ్జి తమ పొలంలో జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఉప్పే శివనాగాంజనేయులు మరో నలుగురు కలసి దౌర్జన్యంగా పొలంలోకి ప్రవేశించి, పనులు అడ్డుకుని, కులం పేరుతో దూషించినట్లు శుక్రవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలో తెల్లదేవరపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ నెలకొల్పారన్నారు. సంక్షేమ పథ

ఎమ్మెల్యే రక్షణనిధి

కాలను నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమచేయడంతో పాటు, వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే పలు సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు సచివాలయ వ్యవస్థ వచ్చాక అటువంటి పరిస్థితి లేదన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, ఆంగ్లమాధ్యంలో బోధన అందించడం జరుగుతుందన్నారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే రుచి చూశారు. ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంటల నాగాచారి, ఎంపీటీసీ చాట్ల మణి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు అనుమోలు శివబాజీ, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ కె.లక్ష్మి, ఎంఈఓ చదల రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

తిరువూరు: మండలంలోని వావిలాలలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఎమ్మెల్యే కే రక్షణనిధి ఆ గ్రామంలో పర్యటించి, సంక్షేమ పథకాల లబ్దిదారులను కలుసుకుంటారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

24న మహాజన సోషలిస్ట్ పార్టీ మహా సభ

తోలుకోడు(మైలవరం): మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర మహాసభ ఈ నెల 24న ఉదయం 10 గంటలకు విజయవాడ బందర్ రోడ్‌లోని బసవ పున్న య్య భవన్‌లో జరుగుతుందని ఆ పార్టీ మైలవరం నియోజకవర్గ నాయకులు మంతెన శ్రీనివాసరావు, ఇంకొల్లు జమలయ్య తెలిపారు. తోలుకోడులో శనివారం శ్రీనివాసరావు నాయకులు మాట్లాడుతూ మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథం అభినందన సభ జరుగుతుందన్నారు. ఈ సభకు పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై మహా సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మైలవరం మండల ఇన్‌చార్జి ప్రత్తిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథికి డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పెనమలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని ఆయన స్వగ్రామం కారకంపాడులో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ శనివారం పరామర్శించారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే తండ్రి, మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యుడు కేపీ రెడ్డయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే పార్థసారథి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, నాయకులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

ముసునూరు: సచివాలయ సిబ్బంది ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని ముసునూరు, గోపవరం, బలివే, చెక్కపల్లి, గుళ్లపూడి చింతలవల్లి గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రవంతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆగిరిపల్లి: మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ పి.రత్నకుమార్‌కు ఎస్టీయూ మండల శాఖ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపు, ఆగిరిపల్లి తిరునాళ్ల మహోత్సవాలకు లోకల్ హాలిడే, ఇతర సమస్యలను పరిష్కరించాలని మండల ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు అంకం వెంకటేశ్వరరావు, మక్కే వేణుగోపాలరావు ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇన్‌కంట్యాక్స్ ఫైలింగ్ ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తున్నామని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సురేష్‌కుమార్, జిల్లా నాయకులు యుఆర్‌కే రాజు, విఠల్ పాల్గొన్నారు.

మిర్చి పంటల పరిశీలన



వలసపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

ముసునూరు: నల్ల తామర తెగుళ్ల నివారణకు నీలం, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఉద్యాన శాఖ సహాయ సంచాలకురాలు జె.శాంతి రైతులకు సూచించారు. మండల ఉద్యాన శాఖాధికారి సీహెచ్ హేమ ఆధ్వర్యంలో రైతులతో కలిసి వలసపల్లి, యల్లాపురంలోని మిర్చి పంటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సాగులో ఉన్న మిర్చి పంటను ఆశించిన నల్ల తామర ఉద్ధృతి నుంచి పంటను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం నల్ల తామర నివారణ, అధిక దిగుబడుల సాధన, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన తక్షణ సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. జిగురు పూసిన పసుపు, నీలం రంగు అట్టలను పెట్టడం ద్వారా తల్లి పురుగుల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. పంటలకు నష్టం వాటిల్లితే ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు తెలియజేయాలని సూచించారు.

ప్రజల్లో చైతన్యం కోసమే నాటికల ప్రదర్శన



హాస్య నాటిక ప్రదర్శిస్తున్న నటీనటులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజల్లో చైతన్యం కోసం 15 ఏళ్లుగా నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు నాగార్జున కళాపరిషత్ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ అన్నారు. కొండపల్లిలో సుంకర–టి కృష్ణ మెమోరియల్ నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 15వ ఆహ్వాన నాటికల ప్రదర్శనలు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. నాటకరంగం కనుమరుగు అవుతుందనడంలో వాస్తవం లేదన్నారు. అనంతరం ఉన్నత ఉద్యోగస్తులు పాశ్చాత్య పోకడలతో జీవితాలు నాశనం చేసుకోవడంతో పాటు సంస్కృతి సంప్రదాయలు దిగజార్చుతున్న ఇతివృత్తంతో సాగిన చిలుకలూరిపేట వారి హాస్య నాటిక 'ఆలీతో సరదాగా' యువతను ఆలోచింపజేసింది. రెండో నాటిక హైదరాబాద్ వారి 'అమెరికా అల్లుడు' ఒక ఉన్నత ఉద్యోగి చేతికి అనూహ్యంగా దొంగనోటు వస్తే అది మార్చుకునేందుకు పడిన ఇబ్బందులను నటీనటులు హాస్యంతో ప్రదర్శించారు. మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరారావు, కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగుల వైద్య పరీక్షల కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం, చిన్నారులు, తల్లిదండ్రులు

మైలవరం: దివ్యాంగ బాలబాలికల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఉచిత ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈడీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దివ్యాంగులకు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాల అనుగుణల కోసం వైద్య నిర్ధారణ శిబిరాన్ని శనివారం విద్యాశాఖ అధికారి సీ.వీ. రేణుక అధ్యక్షతన నిర్వహించారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి ఉపకరణాలు తయారు చేసి అందజేయడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో దివ్యాంగుల పట్ల విభేదం లేకుండా వారిని కూడా మనలో ఒకరిగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మైలవరం మండల విద్యాశాఖాధికారి పీ రత్నశ్యాం బాబు, సమగ్ర శిక్షణా సీఎంఓ రాంబాబు, ఏఎస్ఓ అశోక్‌బాబు, ప్రభుత్వ వైద్యశాఖ విజయవాడ బృందం, సమగ్ర శిక్ష ఫిజియోథెరపిస్టులు బృందం, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎంలు, ఆరు మండలాల ఐఈఆర్‌టీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. సుమారు 300 పైగా చిన్నారులులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విస్సన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.

అర్హులందరికీ ఉపకార వేతనాలు



లయన్ సూరపనేని వెంకటరత్నంను సన్మానిస్తున్న అధ్యాపకులు

మైలవరం: అర్హులైన విద్యార్థులకు నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు మంజూరు చేయనున్నట్లు ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో–ఆర్డినేటర్ లయన్ సూరపనేని వెంకటరత్నం తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలపై అవగాహనా కార్యక్రమం శనివారం జరిగింది. ప్రతిభ కలిగిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయుల ద్వారా నార్త్ సౌత్ ఫౌండేషన్ నడుపుతున్న లాభాపేక్ష లేని సంస్థ అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్ ఎకాడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



యనమదల హైస్కూల్లో మాట్లాడుతున్న సీఐ అంకబాబు

నూజివీడు: వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు అన్నారు. 34వ భద్రతా వారోత్సవాల్లో భా గంగా మండలంలోని యనమదల హైస్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మా ట్లాడుతూ వాహనాన్ని నడపకూడదన్నారు. అంతేగాకుండా ట్రిపుల్‌రైడింగ్ చేయడం నేరమేనన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం విజయకుమారి పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాన్ని నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటివాటి వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై జి.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

నూజివీడు: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను ఎదుర్కొనాలనే పిలుపుతో ఈ నెల 23, 24తేదీల్లో అన్ని ఆర్డీఓ, సబ్‌కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలను చేపట్టాలని ఏసీటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వాల్‌పోస్టర్లను నూజివీడులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ ఉక్కు ఎంతో ముఖ్యమైందన్నారు. దీన్ని ప్రైవేటు పరం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు రాయంకుల లక్ష్మణరావు, ఎం.నాగేంద్రరావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



నెక్కలం గొల్లగూడెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెంలో శనివారం రెండో రోజు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడం ద్వారా సీఎం జగన్ దేశంలోనే మంచి ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. ముందుచూపుతో చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రజలకు మేలు జరిగిందన్నారు. మంచి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోకసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయని ఎమ్మెల్యే ప్రతాప్ తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటివద్దకే అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, ఎంపీపీ అనూష ఇసాక్, సర్పంచ్ లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పటాపంచల గోపాలరావు, నాయకులు నెక్కళపు కృష్ణ, గూండ్ల హనుమంతరావు, గజగంటి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి



నగరపంచాయతీ కార్యాలయంలో సమీక్ష జరుపుతున్న కమిషనర్

తిరువూరు: పట్టణ పరిధిలో పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణ సిబ్బందిని కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం జగనన్న కాలనీలో పక్కాగృహాల నిర్మాణ ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరగా నిర్మాణ పనులు చేపట్టేందుకు తగు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. అనంతరం వార్డు శానిటరీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణంలో సమగ్రంగా పారిశుద్ధ్య పనులను నిర్వహించాలన్నారు. దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. హౌసింగ్ డీఈ రహీముద్దీన్ పాల్గొన్నారు.

గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



బేటీ బచావో బేటీ పఢావో లక్ష్యాలపై వాల్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): మండల పరిషత్ పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవా ల్లో భాగంగా బేటీ బచావో బేటీ పఢావో (ఆడపిల్లలను రక్షించండి ఆడపిల్లలను చదివించండి) కార్యక్రమం శనివారం జరిగింది. మహిళా సంరక్షణ అధికారి సునీత బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పఢావో పథకం లక్ష్యాలను వివరించారు. బాలికల విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాల నిర్మూలన, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాఠశాలలో బాలికల విద్యపై వ్యాసరచన పోటీలు నిర్వహించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు అనురాధ, ఇర్ఫాన్ పాషా, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

మైలవరం: బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీలత పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ పరిధిలోని మైలవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం బాలికా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లలను రక్షిద్దాం, ఆడ పిల్లల్ని చదివిద్దాం అనే నినాదాలతో బాలికలు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్ఎం శ్రీలత మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధించాలన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. స్థానిక పాఠశాలల్లో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

జాతీయ బాలికా దినోత్సవం



చంద్రగూడెం ప్రభుత్వ పాఠశాలలో బాలికా దినోత్సవంలో పాల్గొన్న బాలికలు

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం కస్తూర్బాగాంధీ బాలికలవిద్యాలయంలో శనివారం జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి మాట్లాడుతూ బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలనిన్నారు. బాలలపై వేధింపులు అరికట్టాలని తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యామల, చైల్డ్ లైన్ కో–ఆర్డినేటర్ రమేష్, చైల్డ్ లైన్ ప్రతినిధులు నాగరాజు, ప్రకాష్‌కుమార్, మేరి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

రెడ్డిగూడెం: స్థానిక గీతాంజలి ఉన్నత పాఠశాల్లో మైలవరం స్పెషల్ ఇన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.గిరిజ సత్యకుమారి శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ వివక్ష, కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాలు మత్తు ప్రదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పాము కాటుతో రెండు గేదెల మృతి



చాట్రాయి: పాము కాటుకి రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని నరసింహారావుపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అత్తునూరి కృష్ణారెడ్డి గురువారం తన తోటలోకి పశువులను మేపడానికి తోలుకెళ్లాడు. ఆ రోజు పాము కరవడంతో ఒక గేదె చనిపోయింది. రెండో రోజున మళ్లీ తోటలోకి తోలుకెళ్లగా ఒకేసారి పశువులు బెదిరిపోయాయి. ఆ సమయంలో మరో గేదెను పాము కరవడంతో ఇంటికి వచ్చిన తరువాత నోటి వెంట నురగ కకుక్కతూ చనిపోయింది. ఒకేసారి రెండు గేదెలు చనిపోవడంతో ఏం చేయాలో? తెలియడం లేదని యజమాని వాపోతున్నాడు.

ప్రకటన

చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్

తిరువూరు, 21-01-2023